సేంద్రియ సాగుతో లాభాలు

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల రైతులు ప్రణాళికాబద్ధంగా ఏడాది పొడవునా కూరగాయలు సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నారు. ఒకే రకమైన పంట కాకుండా విభిన్న పంటలు సాగు చేస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. పండిన పంటను మార్కెట్‌లో కొంత.. నేరుగా వినియోగదారులకు కొంత విక్రయించి లాభాలు పొందుతున్నారు. భావితరాల అరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సేంద్రియ విధానంలో పంటలు పండిస్తున్నారు. దీంతో సాధారణంగానే వీరు పండిస్తున్న పంటలకు డిమాండ్ ఉంటుంది. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా లక్ష్మణచాంద మండలంలోని చామన్‌పెల్లి, పీచర, మల్లాపూర్, పొట్టపెల్లి, రాచాపూర్ వంటి గ్రామాల్లోని పలువురు రైతులు సేంద్రియ విధానంలో కూరగాయలు సాగు చేస్తూ ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు.

- కూరగాయలు పండిస్తూ తోటివారికి ఆదర్శంగా నిలుస్తున్న రైతులు


చామన్‌పెల్లిలో టమాటాలు తెంపుతున్న మహిళ


చామన్‌పెల్లిలో వంకాయ తోట


ఈ చిత్రంలో కన్పిస్తున్న వ్యక్తి మండలంలోని పొట్టపెల్లి (కే) గ్రామానికి చెందిన ముస్కు రమణారెడ్డి. గతంలో మొక్కజొన్న, పసుపు పంటలు సాగు చేసి దిగుబడి రాక నష్టపోయాడు. ప్రస్తుతం అర ఎకరంలో వంకాయ, బీర, కూరబబ్బెర సాగు చేస్తున్నాడు. పెట్టుబడి రూ.20వేలు కాగా.. ఆదాయం రూ.80వేలు వచ్చినట్లు పేర్కొంటున్నాడు. ప్రస్తుతం మార్కెట్‌లో బీరకాయ ధర కిలోకు రూ.80 పలుకుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నాడు.


ఈచిత్రంలో కన్పిస్తున్న వ్యక్తి మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన చిన్నయ్య.ఈ రైతు ఎకరం విస్తీర్ణంలో చిక్కుడు, బీర, బెండకాయ వంటి కూరగాయలు సాగు చేస్తున్నారు. ఇప్పటివరకు రూ.1.20లక్షలు ఆదాయం రాగా పెట్టుబడులకు రూ.30వేలు ఖర్చయినట్లు పేర్కొన్నాడు. చిన్నయ్య తాను పండించిన కూరగాయలను దళారులకు కాకుండా తనే ఆటోలోనే గ్రామాలకు వెళ్లి అక్కడున్న మార్కెట్లలో విక్రయిస్తుంటాడు.


పై చిత్రంలో కన్పిస్తున్న వ్యక్తి లక్ష్మణచాంద మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన సురకంటి పెద్ద రాజారెడ్డి అనే రైతు. ఇతడు నాలుగెకరాల్లో కూరగాయలు పండిస్తున్నాడు. టమాటా, వంకాయ, కొత్తిమీర, బబ్బెర, కాకర, మెంతి, చిక్కుడు తదితర కూరగాయలు సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం టమాటా, వంకాయ, చిక్కుడు, కూర బబ్బెర, కాకర, మెంతి, కొత్తిమీర కాత దశకు చేరాయి. ఈ నాలుగెకరాలకు పెట్టుబడి రూ.50వేలు అయినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం టమాటాలకు ధర లేకున్నా.. ఇతర కూరగాయలకు ధర ఉండటంతో మంచి ఆదాయం వస్తున్నట్లు ఈ రైతు పేర్కొంటున్నాడు. రోజుకు కనీసం రూ.3వేలు వరకు వస్తుందని.. ఇప్పటివరకు పెట్టుబడులు పోను రూ.రెండు లక్షల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నాడు.

క్లుప్తంగా

బడీడు పిల్లలను పాఠశాలకు పంపాలి


వివరాలు నమోదు చేస్తున్న సీఆర్పీలు

ఖానాపూర్: బడీడు పిల్లలను విధిగా తల్లిదండ్రులు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని సీఆర్పీలు నౌమాని, సంతోష్ అన్నారు. ఎంఈవో ప్రేమ్‌సాగర్ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని తర్లపాడ్ గ్రామంలో బడి బయట పిల్లల సర్వే నిర్వహించి ఇద్దరిని గుర్తించారు. అనంతరం వారి వివరాలు నమోదు చేసుకొని వారి తల్లిదండ్రులకు చదువు లాభాలను వివరించారు.

మహిళలు వ్యాపారులుగా రాణించాలి


సర్టిఫికెట్ అందిస్తున్న ఎంపీడీవో రాధ

లక్ష్మణచాంద: ఈడీఐఐ సంస్థ ఆధ్వర్యంలో ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకొని మహిళలు వ్యాపారవేత్తలుగా రాణించాలని ఎంపీడీవో రాధ అన్నారు. మండలంలోని పలువురు మహిళలు చేతితో తయారు చేసే ఆభరణాలపై 26 రోజులు శిక్షణ కార్యక్రమం పొందారు. సోమవారం మండలకేంద్రంలో శిక్షణ పూర్తి చేసిన 25 మంది మహిళలకు ఎంపీడీవో సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు రవి, అలేఖ్య, మహిళలు పాల్గొన్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయాలి


రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రమేశ్

కడెం: పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల పన్నులను వసూలును వేగవంతం చేయాలని డీఎల్‌పీవో రమేశ్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని గ్రామపంచాయతీని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ తదితర బకాయిలను వందశాతం వసూలు చేయాలని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు త్వరలోనే విడుదల చేస్తామన్నారు. ఇక నుంచి కార్మికులకు ప్రతి నెల బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీవో కవిరాజ్, పంచాయతీ కార్యదర్శి మునిరుల్ హసన్, కారోబార్ మోసిన్ తదితరులున్నారు.

'దౌనెల్లిలో సర్వేకు సహకరిస్తాం'


మాట్లాడుతున్న తహసీల్దార్ అహ్మద్ ఖాన్

కుంటాల: తాము అర్హులమైనా సర్వేలో తమ పేర్లు రాలేదని మండలంలోని దౌనెల్లిలో గురువారం అధికారులు నిర్వహించిన సర్వేను గ్రామస్తులు బహిష్కరించిన విషయం తెలిసిందే. దీంతో సోమవారం తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ఎంపీవో రహీంఖాన్ గ్రామస్తులతో చర్చించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూస్తామని చెప్పడంతో గ్రామస్తులు సర్వేకు సహకరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాహేందర్, గ్రామస్తులు ఉన్నారు.

'ముధోల్ ఎమ్మెల్యేపై దుష్ప్రచారం వద్దు'


మాట్లాడుతున్న పోతన్న

ముధోల్: ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌పై దుష్ప్రచారం చేస్తే ఊరుకోబోమని బీజేపీ మండలాధ్యక్షులు కోరి పోతన్న అన్నారు. సోమవారం ముధోల్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ అభివృద్ధికి పాటుపడుతున్న ఎమ్మెల్యేపై అసత్యాలు ప్రచారం చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని పేర్కొన్నారు. వారి విషయంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సతీశ్‌రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల సమస్యలు పరిష్కరించాలి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలోని సీ5, సీ6 బ్లాక్‌లలో తాగునీటి సమస్య నెలకొనడంతో ఇబ్బంది పడుతున్నామని విన్నవించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నంది రామయ్య, సౌజన్య, విజయలక్ష్మి, మల్లవ్వ, గంగామణి, ప్రమీల, జల తదితరులున్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

భైంసాటౌన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని యాకుత్‌పుర ఎంఐఎం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్ అన్నారు. సోమవారం పట్టణంలోని రెయిన్‌బో పాఠశాలలో ఎంఐఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పరీక్షలంటే భయం వీడి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో భైంసా మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎండీ జాబిర్ అహ్మద్, ఎంఐఎం కౌన్సిలర్లు ఫైజుల్లా ఖాన్, బాబా, మాజీద్, కోఆప్షన్ సభ్యుడు ఇంతియాజ్, నాయకులు ఉన్నారు.

గ్రామసభలు విజయవంతం చేయాలి


ఖానాపూర్‌లో మాట్లాడుతున్న అధికారులు

ఖానాపూర్: మండలంలో ఈనెల 21 నుంచి 23 వరకు నిర్వహించే గ్రామసభలను విజయవంతం చేయాలని తహసీల్దార్ శివరాజ్, ఎంపీడీవో సునీత అన్నారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో పంచాయతీల ప్రత్యేకాధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. సమావేశంలో సీడీపీవో సరిత, ఎంపీవో రత్నాకర్‌రావు, సూపరింటెండెంట్ నర్సింహస్వామి, తదితరులు ఉన్నారు.

కుభీర్: ప్రజాసంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులకు లబ్ధిదారుల ఎంపిక కోసం మండలంలోని 42 గ్రామపంచాయతీల్లో నేటి నుంచి ఈనెల 24వరకు గ్రామసభలు ఉంటాయని ఎంపీడీవో నవనీత్‌కుమార్ తెలిపారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయాధికారులు పాల్గొంటారని.. ప్రజలు హాజరై సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సోన్ మండలంలో..

సోన్: మండలకేంద్రంతోపాటు అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో నేటి(మంగళవారం) నుంచి మూడు రోజులపాటు ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు సోమవారం ఎంపీడీవో సురేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 21వ తేదీన న్యూవెల్మల్, లోకల్ వెల్మల్, కడ్తాల్, గంజాల్, మాదాపూర్ గ్రామాల్లో, 22న జాఫ్రపూర్, పాక్‌పట్ల, సోన్, సిద్ధులకుంట 23న బొప్పారం, కూచన్‌పల్లి సంగంపేట, ఓల్డ్ పోచంపాడ్, సాకెర గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో రైతుభరోసా, ఇందిరమ్మఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలతోపాటు రేషన్‌కార్డుల కోసం లబ్ధిదారుల ఎంపికకు ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లింబాద్రి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 21న అంబకంటి, అంబకంటితండా, ఓలా, విఠాపూర్, ఈనెల 22న అందాకూర్, దౌనెల్లి, లింబా(బి), సూర్యాపూర్, ఈనెల 23న లింబా(కె), మెదన్‌పూర్, వెంకూర్, ఈనెల 24న అంబుగామ, కల్లూరు, కుంటాల, పెంచికల్‌పాడ్ గ్రామాల్లో నిర్వహించే గ్రామసభలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జిల్లాను అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి


బోరిగాంలో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సారంగపూర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని.. నిధులు తీసుకొచ్చి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. పీఎంజీఎస్‌వై నిధులు రూ.1.85 కోట్లతో బీరవెల్లి గ్రామం నుంచి గొడిసెర గ్రామానికి ఆరు కిలోమీటర్ల మేర నిర్మించే రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామస్తుల వినతి మేరకు వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించారు. ధని, జామ్, మలక్‌చించోలి, కంకెట, వైకుంఠాపూర్, తాంద్ర(జి) బోరిగాం, ఆలూరు తదితర గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నాలుగేళ్లలో రూ.850 కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ తుక్కారాం, నాయకులు గంగారెడ్డి రాంశంకర్‌రెడ్డి, విలాస్, తిరుమలచారి తదితరులు ఉన్నారు.

ధ్వజస్తంభం ఏర్పాటు చేయిస్తా

సోన్: మండలకేంద్రంలోని గొడిసెర్యాల శ్రీ రాజరాజేశ్వర ఆలయ కమిటీ సభ్యులు సోమవారం నిర్మల్‌లో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వచ్చే నెలలో ఆలయంలో నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి తరలిరావాలని కోరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సొంత ఖర్చులతో ఆలయ ధ్వజస్తంభం ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు, ధర్మకర్త బెజ్జారం సదానంద్‌చారి, శివ భక్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


భైంసాలో మాట్లాడుతున్న ఎస్సై మహమ్మద్ గౌస్

కుంటాల: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై సిహెచ్ భాస్కరాచారి పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని కల్లూరు 61 జాతీయ రహదారిపై వాహనదారులకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది పాల్గొన్నారు.

తాగి వాహనాలు నడుపొద్దు

భైంసాటౌన్: మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడొద్దని పట్టణ ఎస్సై మహమ్మద్ గౌస్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని కుభీర్ జీప్ అడ్డా వద్ద వాహనదారులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సై, కానిస్టేబుళ్లు ఉన్నారు.

మాజీ మంత్రి పరామర్శ


చామన్‌పెల్లిలో పరామర్శిస్తున్న ఐకే రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి గ్రామంలో కొమ్ముల రత్నవ్వ అనే మహిళ ఇటీవల మృతి చెందగా.. మల్లాపూర్‌లో మాజీ ఎంపీపీ రమేశ్ తండ్రి అనారోగ్యం బారిన పడ్డారు. సోమవారం బాధిత కుటుంబాలను మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం రాచాపూర్‌లో మృతి చెందిన శంకర్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, నాయకులు అల్లోల సురేందర్‌రెడ్డి, రాజేశ్వర్, అర్జున్‌రెడ్డి, మేకల రాజేందర్, గంగాధర్, కేశం రమేశ్, రమణ, సుదర్శన్, సంజీవరెడ్డి, గంగారెడ్డి, మధు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఖానాపూర్: మండలంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో నూతన ఫీడర్ ఏర్పాటు నేపథ్యంలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాంసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. సుర్జాపూర్, బాదన్‌కుర్తి, మస్కాపూర్, మేడంపల్లి, వెంకటాపూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు.

'రంగుపూల ముఖాలు' ఆవిష్కరణ


కవితాసంకలనం ఆవిష్కరిస్తున్న కవులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని కావేరి గ్రంథాలయంలో సోమవారం ప్రముఖ కవి ఎల్.రాజేశ్వరరావు రచించిన 'రంగుపూల ముఖాలు' కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. కావేరి ఫౌండేషన్, మానస సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అప్పాల చక్రధారి మాట్లాడుతూ పాఠశాలల్లో పిల్లల మనస్తత్వాన్ని వాతావరణాన్ని, ప్రకృతితో పసితనం ఏ విధంగా ముడి వేసుకుంటుందో కవి అద్భుతంగా రచించారని కొనియాడారు. తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు మాట్లాడుతూ పాఠశాల వయసులో బాలుర వైవిధ్యమైన మనస్తత్వాన్ని చక్కగా రచించారని ప్రశంసించారు. కార్యక్రమంలో మానస సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు తుమ్మల దేవరావ్, కవులు అబ్బడి రాజేశ్వర్‌రెడ్డి, కుమ్మరి నాగారాం, లైబ్రరీ ఇన్‌చార్జి దీపక్‌రెడ్డి, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


పరీక్షలు చేస్తున్న విజయ్‌కుమార్

కడెం: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని దస్తురాబాద్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలో పాండవపూర్ గ్రామంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ప్రసవం జరిగేలా గర్భిణులు వైద్యుల సూచనల మేరకు వ్యాయామం చేయాలన్నారు. ఇందులో హెచ్‌ఈవోలు శైలేంద్ర, కన్నయ్య, సూపర్‌వైజర్లు లలిత, సంతోష్, హెల్త్ అసిస్టెంట్ మల్లేశ్, ల్యాబ్ టెక్నీషియన్ రాజేందర్, ఆశవర్కర్లు వనజ, అనసూయ, విజయ తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ లింగమూర్తి

తానూరు: ప్రజాసంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ లింగమూర్తి సూచించారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో తహసీల్దార్ సమీక్ష నిర్వహించారు. అన్ని దరఖాస్తులను పరిశీలించి అర్హులనే ఎంపిక చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వర్మీకంపోస్టు తయారు చేయాలి

లక్ష్మణచాంద: గ్రామాల్లోని సెగ్రిగేషన్ షెడ్లలో వర్మీకంపోస్టు తయారు చేయాలని ఎంపీడీవో రాధ తెలిపారు. సోమవారం మండలంలోని కనకాపూర్ గ్రామ నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డును ఎంపీడీవో పరిశీలించి మాట్లాడారు. నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలకు రెండు పూటలా నీళ్లు పట్టి గడ్డి పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సెగ్రిగేషన్ షెడ్లలో తయారు చేసిన ఎరువులను విక్రయించి పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలని పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో సోమవారం ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సంఘం పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో గౌరవ అధ్యక్షుడిగా రమేశ్, అధ్యక్షుడిగా కుమ్మరి శేఖర్, ప్రధాన కార్యదర్శిగా ధనాల కోట కృష్ణ వర్మ, కోశాధికారిగా దొంతుల గంగాధర్, ఉపాధ్యక్షుడిగా నరేందర్, సంయుక్త కార్యదర్శిగా సంతోష్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

'దుండగులను శిక్షించాలి'

లక్ష్మణచాంద: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కంబాలపల్లి రాములుపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పీచర ప్రాథమిక పాఠశాలలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. దాడి చేసిన వారిని పోలీసులు వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోదా వరి, సునీత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జడ్జిని కలిసిన న్యాయవాది

నిర్మల్‌టౌన్: హైదరాబాద్ లోని జ్యుడీషియల్ అకాడమీలో మెడిటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాం పూర్తి చేసుకున్న న్యాయవాది లింగన్న సోమవారం నిర్మల్‌లోని ప్రధాన కోర్టులో జిల్లా జడ్జి కర్ణకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. ఇందులో సీనియర్ న్యాయవాదులు రాజలింగం, రాజశేఖర్, అశోక్, లింగాగౌడ్, రాజు, తదితరులు ఉన్నారు.

ఎంజేపీలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

లక్ష్మణచాంద: మహాత్మ జ్యోతిబాపూలే(ఎంజేపీ) గురుకుల బాలుర, బాలికల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం వచ్చే నెల 2లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని రాచాపూర్ ఎంజేపీ అధ్యాపకుడు నాగరాజు కోరారు. సోమవారం మండలంలోని పొట్టపెల్లి, చామన్‌పెల్లి, లక్ష్మణచాంద గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. అనంతరం దరఖాస్తు విధానం, కావాల్సిన సర్టిఫికెట్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కవికి సన్మానం


సన్మాన పత్రం స్వీకరిస్తున్న వెంకట్

నిర్మల్‌ఖిల్లా: హైదరాబాద్‌లోని భారత్ వికాస్ పరిషత్ వేదికపై శ్రీ వాగ్దేవి కళాపీఠం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సంగీత, సాహిత్య, కళాసంగమం కార్యక్రమంలో జిల్లా కవి బి.వెంకట్ వృత్త పద్యగానం చేశారు. జిల్లా కేంద్రానికి చెందిన కవి, సంస్కృత భాషాప్రచార సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకట్..'రైతు కృషి'అంశంపై గానం చేసిన తెలుగు వృత్త పద్యాలు శ్రోతలను అలరించాయి. అనంతరం అష్టావధానం, కళాకదంబం సభా కార్యక్రమంలో సైతం వీరు పాల్గొన్నారు. శ్రీ వాగ్దేవి కళా పీఠం వ్యవస్థాపకులు వెంపరాల వెంకటలక్ష్మి, శ్రీనివాసమూర్తి, సాహితీవేత్తలు గట్టి కృష్ణమూర్తి, అష్టావధాని అంజయ్య, రామకృష్ణారావు వెంకట్‌కు సన్మాన పత్రం అందించారు.